


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్స్, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-18లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గ్‌లో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' గత మాసంలో ముగిసింది. చివరిగా ఇప్పుడు 'మలి సందడి' అంశాల వివరణ. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

చివరి విడత: మలి సందడి

నిన్న లేని అందమేదో

మనిషి తత్వం చిత్రమైనది. ధర్మరాజు అంతటివాడు స్వర్గప్రాప్తి కలిగినప్పుడు – అక్కడి వైభోగానికి సంతోషించడానికి బదులు – తనవాళ్లున్న నరకాన్ని తల్చుకుని బాధపడ్డాట్ట. మనకున్నది అందరితో సమంగా పంచుకోలేకపోయినా – సాటి పౌరులకు కనీస అవసరాలు తీరాలనుకునే పాటి సామ్యవాదం చాలామందికే ఉంటుంది.

వారిలో నేనూ ఒకణ్ణి అనుకుంటాను.

జర్మనీలో నాకు అభిమానానికీ, ఆప్యాయతకీ, అనురాగానికీ, ఆదరణకీ లోటు అనిపించలేదు. కానీ –

'ఎటు చూసినా చిరు నగవుల మోములు
ఎటు చూసినా తడి యారని పెదవులు
ఇది జర్మనీ ఇక్కడున్నది మనీ
ఎటు చూసినా పెను వెతలతో మోములు
ఎటు చూసినా పొడిబారిన పెదవులు

ఇది కర్మభూమి ఇక్కడున్నది లేమి'

జర్మనీలో అడుగు పెట్టినప్పుడే అప్రయత్నంగా నాలో కలిగిన స్పందన ఇది. ఆతర్వాత కూడా అడపాతడపా ఈ భావన మనసులో రేగి మనసు కలుక్కుమంటూండేది.

ఐతే వచ్చిన కొత్తలో వాతావరణం సానుకూలంగా ఉండేది. పరిసరాలు ఆహ్లాదంగా అనిపించేవి. ప్రకృతి మైమరపించేది. వీటన్నింటికీ తోడు – నేనప్పుడు మళ్లీ విద్యార్థి దశలోకి వెళ్లాను. అదో ప్రపంచం.

బెర్లిన్ వచ్చేసరికి వాతావరణం క్రమంగా మారుతోంది. విద్యార్థిదశనుంచి అడ్వాన్స్‌డ్ రీసెర్చికి వచ్చాను. నేను మళ్లీ వాస్తవంలోకి వచ్చాను. వాస్తవంలో నా ప్రపంచం అతి చిన్నది. నేను, నా భార్యాబిడ్డలు.

భార్యాబిడ్డలు దగ్గరలేక – నా చిన్ని ప్రపంచం బోసిపోయింది. ఆపైన –

వణికించే చలి. ఆకులు రాల్చిన చెట్లు. కాన రాని పూలు. ప్రకృతి అందాల్ని అస్పష్టం చేస్తున్న మంచు తెరలు. సాటి మనుషులే ఐనా – మనది కాని రంగుతో, మనకి నప్పని సంప్రదాయాలతో, మనకి లేని వైభవంతో – మనవాళ్లు అనుకోవడం కష్టమనిపించే జనాల నిత్య మహోత్సాహం.

ఆ పరిసరాల్లో రోజులు రసహీనంగా భారంగా గడిచి పోతున్న సమయమది. అలాంటప్పుడు అనుకోకుండా నావాళ్లు నా దగ్గరకొస్తే...

1964లో చూసిన పూజాఫలము చిత్రం గుర్తుకొచ్చింది. అందులో హీరో నాగేశ్వరరావు కాలేజి విద్యార్థి. జమీందారు బిడ్డయినా మహా బిడియస్థుడు. తోటి విద్యార్థులతో కూడా కలవలేక, అపహాస్యానికి గురౌతుంటాడు. వాళ్లింట్లో అద్దెకు దిగిందో కుటుంబం. వాళ్లమ్మాయి జమున మహా చలాకీ. ఎప్పుడూ ఆడుతూ పాడుతూ 'పగలే వెన్నెలా జగమే ఊయలా' అనిపించేటంత హుషారుగా ఉంటుంది. తనే చొరవ చేసి ఆమె హీరోతో పరిచయం చేసుకుంటుంది. ఆమె పట్ల అమితంగా ఆకర్షితుడైన హీరోకి 'నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో' అనిపిస్తుంది.

నావాళ్లు బెర్లిన్లో అడుగు పెట్టగానే నా పరిస్థితీ అదే!

అప్పుడు నాలో కొత్త ఉత్సాహం కలిగింది. కొత్త శక్తి నన్నావహించింది.

వణికించే చలి మధురం. బోసిపోయిన చెట్లు మధురం. పుష్పరహిత ప్రకృతి మధురం. ఆ ప్రకృతిని కప్పిన మంచు తెరలు మధురం. మనవాళ్లు ఐనా కాకున్నా – నా చుట్టూ ఉన్న మహాజనసందోహపు నిత్యమహోత్సాహం మధురం.

నేనుంటున్న ఇల్లు మధురం. ఆ ఇంటి యజమాని ఒలోముచ్‌కీ పలకరింపు మధురం.

ఒక్కసారిగా నా పరిసరాలు, ఇల్లు – అన్నీ మనోహరంగా మారిపోయాయి.

నేనలా మరో లోకపు అనుభూతుల జల్లులో మార్పుల్ని తలచుకుని పరవశిస్తుంటే – శ్రీమతి నాలో వేరే మార్పుల్ని గమనిస్తోంది. "మీరు చాలా మారారు. మిసమిసలాడిపోతున్నారు" అందామె.

ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చాను. ఆమె మాటల్ని ఆకళింపు చేసుకుని తననీ, నన్నూ మార్చి మార్చి చూశాను.

నిజమే!

శ్రీమతిది మేలిమి బంగరు ఛాయ. ఆమె పక్కనున్నప్పుడు నాదెప్పుడూ చిలకలపూడి బంగారం మెరుపు.

అప్పుడు మాత్రం నేనే ఎక్కువ మెరుస్తున్నాను. ఐనా మనసొప్పక, "నీకంటేనా?" అన్నాను.

ఆమె తడుముకోలేదు, "ఊఁ" అంది.

అప్పుడన్నాను – "అవున్లే – అప్పుడే మెరుగు పెట్టిన చిలకలపూడి బంగారం, అసలు బంగారం కంటే ఎక్కువ మెరిసిపోతుంది" అని.

శ్రీమతి కళ్లలో కొంచెం వెలుగు. "అసలో, నకిలీయో – మిసమిస మిసమిసే" అంది కొంచెం ఇబ్బందిగా.

నేను వెంటనే, "వళ్లు చుర్రుమనిపించే ఎండ ఏడాదికి ఒకటి రెండు రోజులకి మించి ఉండదు జర్మనీలో. ఇంట్లో ఉన్నా బయట ఉన్నా – నీడపట్టున ఉన్నట్లే! ఈ మిసమిసకి నాకైతే ఎనిమిది నెలలు పట్టింది. నీకైతే ఎనిమిది రోజులు చాలు" అన్నాను.

శ్రీమతి ఏదో అనబోయింది. అంతలో అమ్మాయి వచ్చి, "అమ్మా! తమ్ముడు చూడు" అంది.

చూడ్డానికేముంటుంది – అది పితూరీ.

చాలామంది వయసులో ఉండగా ప్రేమ, ప్రేమ అంటూ వెంపర్లాడతారు కానీ – వాస్తవంలో దంపతుల్ని మించిన ప్రేమికులుండరు.

మేము ఎంతో కాలం తర్వాత కలుసుకున్నాం. మా ఆలోచనల్లో మేమిద్దరమే ప్రపంచంగా అయిపోయాం. అది మాటలకందని ఓ గొప్ప ప్రేమానుభూతి!

పరిసరాలకు అలవాటు పడడంలో ఎవరైనా పిల్లల తర్వాతనే! అందులోనూ తలిదండ్రులు పక్కనున్నప్పుడు – ఆ ధైర్యం పిల్లల్ని తమదైన ప్రపంచంలోకి నడిపిస్తుంది. వాళ్లు మమ్మల్ని మా మానాన వదిలి గదిలో పరుగులెడుతూ ఆటలు మొదలెట్టారు. ఆ ఆటలు అప్పుడే పితూరీల స్థాయికి వచ్చి మమ్మల్ని మా ప్రపంచంలోంచి వాస్తవానికి తీసుకొచ్చాయి.

"అమ్మా! తత్త చూడు" అన్నాడు అబ్బాయి. వాడికింకా అన్ని అక్షరాలూ పలకడం లేదు. అక్క అనడానికి 'తత్త' అంటాడు.

వాడికి తను అల్లరి చేస్తున్నానని తెలియదు. తోచింది చేస్తాడు. తర్వాత అక్కని అనుకరిస్తాడు.

అక్క చూడు అంది కదా అని తనూ చూడమన్నాడు.

"అమ్మ మీ ఇద్దర్నీ చూడాలా? మనమంతా కలిసి వెళ్లి షాపులు చూడాలా?" అన్నాను.

పిల్లల దృష్టి మరల్చడంలో నాకు నేనే సాటి అని – శ్రీమతే చాలాసార్లు సర్టిఫికెట్టిచ్చింది.

అమ్మాయి వెంటనే, "మీరు నన్నెత్తుకోవాలి" అంది.

పాపం, దానికి కొంతకాలంగా తీరని కోరిక అది!

చటుక్కున దాన్నెత్తుకున్నాను. అబ్బాయి వెంటనే నా దగ్గరకొచ్చి తననీ ఎత్తుకోమని చేతులు చాచాడు.

వాణ్ణీ ఎత్తుకున్నాను. ఇద్దరూ నా చేతుల్లో ఉంటే – అదో మధురానుభూతి!

"బాగా రాత్రయింది. షాపులు మూసేస్తారేమో!" అంది శ్రీమతి.

"మూసేస్తారు కానీ, మూసేసినప్పుడే చూడ్డానికి ఎక్కువ బాగుంటాయి. విండో షాపింగు గురించి వ్రాశానుగా, అది చేద్దాం. అట్టే దూరం కూడా కాదు, పక్కనే!" అన్నాను.

వాళ్లకెంత సరదాయో తెలియదు కానీ, నాకు మాత్రం వాళ్లతో విండో షాపింగ్ చెయ్యాలని మహా ఉబలాటంగా ఉంది.

"ముందు వాళ్లని దింపండి. కొంచెం దూరం నడిపిద్దాం. ఎప్పుడు నడవలేనంటే అప్పుడే ఎత్తుకోవచ్చు" అంది శ్రీమతి నన్ను హెచ్చరిస్తూ.

నేను పిల్లల్ని దింపాను. ఇంటికొచ్చేక ఎవరూ డ్రస్సులు మార్చుకోలేదు. అందుకని అలాగే బయల్దేరాం.

ఇంటికి తాళం వేసి వీధిలోకొచ్చేసరికి నాకు మళ్లీ భువనేశ్వర్ రోజులు గుర్తుకొచ్చాయి. సాయంత్రం ఆఫీసునుంచి రాగానే నలుగురం కలిసి ఊళ్లోకి బయల్దేరేవాళ్లం. ఎక్కడికెళ్లినా నలుగురం ఒక యూనిట్‌కింద వెళ్లేవాళ్లం. ఎన్నో నెలల తర్వాత మళ్లీ ఆ అనుభవం...

మా ఇంటికి పక్కనే నాలుగడుగుల దూరంలో ఉంది విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసే. ఆ వీధినిండా దుకాణాలే.

"దగ్గరంటే మరీ ఇంత దగ్గరా!" అని ఆశ్చర్యపోయింది శ్రీమతి.

ఇంత సెంటర్లో ఇల్లు సంపాదించినందుకు గర్వంగా నవ్వాను.

ఆ వీధిలో ఒకో షాపు వద్దకే తీసుకెడుతూ అద్దాల తలుపుల వెనుక కనిపిస్తున్న వస్తువుల గురించి వివరిస్తున్నాను. పిల్లలిద్దరే కాదు, శ్రీమతి కూడా పెద్ద కళ్లు చేసుకుని వింటుంటే నాలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. ఒక షాపు దాటగానే అబ్బాయి నిద్రకి జోగడం మొదలెడితే వాణ్ణి ఎత్తుకున్నాను. వాడు వెంటనే నిద్రపోయాడు.

రెండో షాపు దాటేసరికి అమ్మాయి తనకీ నిద్దరొస్తోందంది.

"వాణ్ణెత్తుకున్నారుగా, అందుకని..." అంది శ్రీమతి దాని మాటని నటనగా తేల్చిపారేస్తూ.

నామీద ఎంతో నమ్మకం పెట్టుకుని మన దేశంనుంచి ఈ దేశానికి వచ్చిన కూతురు. నేను దాని మాటని తీసి పారేయలేనుగా – దాన్నీ ఎత్తుకున్నాను.

"నేనే ఎత్తుకునేదాన్ని. బాగా అలసటగా ఉంది" అంది శ్రీమతి సంజాయిషీగా.

"కానీ నాకు అలసటగా లేదు. నీకూ నిద్దరొస్తుంటే చెప్పు" అన్నాను నర్మగర్భంగా.

"నడిరోడ్డు. జనాలు బాగా తిరుగుతున్నారు. సిగ్గు లేదూ, ఇలాంటి మాటలనడానికి!" అంది శ్రీమతి మందలిస్తున్నట్లు.

"ఇది తెల్లవాళ్ల దేశం. ఇలాంటి మాటలకీ, చేతలకీ సిగ్గు పడే సమాజం కాదిది" అన్నాను.

నా మాటని ఋజువు చెయ్యడానికా అన్నట్లు – అక్కడున్న ఓ జంట – విండో షాపింగు చేస్తూ మధ్యలో ఒకరినొకరు గట్టిగా కౌగలించుకుని గాఢంగా చుంబించుకున్నారు.

శ్రీమతి చూసింది. తనున్నది థియేటర్ కాదు, నడి రోడ్డు. చూస్తున్నది హాలీవుడ్ సినిమా కాదు, సాటి జనాన్ని.

ముందుగా ఆమెలో చిన్న షాక్. అంతలోనే ఉలికిపాటు. చటుక్కున ముఖం తిప్పుకుని అప్రయత్నంగా అమ్మాయిని గమనించింది. అది కళ్లు మూసుకుని ఉంటే – ఓసారి కదిపి చూసి, "ఇది నిజంగానే నిద్దరోయింది. నాకూ అలసటగా ఉంది. ఇక ఇంటికి వెళ్లిపోదాం" అంది.

సంస్కృతీ సంప్రదాయాల్లో ఇంతటి తీవ్ర విభేదాన్ని ప్రత్యక్షంగా చూసి తట్టుకోలేకపోయిందని నాకు అనిపించలేదు.

నా వాళ్లది ప్రయాణం బడలిక అన్న విషయం అప్పటికి నా అవగాహనలోకి వచ్చింది.

వెంటనే వెనుదిరిగాను. నేను వద్దన్నా వినకుండా శ్రీమతి అబ్బాయిని నా దగ్గర్నుంచి తీసుకుంది.

ఇంటికి వెడుతూంటే అప్రయత్నంగా అందుకున్నాను – 'నిన్న లేని అందమేదో...."

శ్రీమతి చటుక్కున, "ప్లీజ్! ఆ పాట వద్దు. నాకది నిన్నటి దినాన్ని గుర్తు చేస్తోంది" అంది.

"అదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం లేదు. మీ నిన్న వేరు. నా నిన్న వేరు" అందామె.

"అంటే?" అన్నాను అర్థం కాక.

"మీ నిన్న ఏమిటో నేనూహించగలను. నా నిన్న గురించి మీరూహించలేరు" అందామె.

నాకింకా అర్థం కాలేదు. "అంటే?" అన్నాను మళ్లీ.

"మీకర్థం కాదులెండి. మేమిక్కడికి రాగానే మీరు ఒంటరిగా అనుభవించిన 'నిన్న'ను నాకు పరిచయం చెయ్యాలనుకున్నారు. మరి నేను ఒంటరిగా అనుభవించిన ఆ 'నిన్న' గురించి మాటవరసకైనా అడగలేదు...." ఆగిందామె. ఆ గొంతులో తడి.

అప్పుడర్థమైంది నాకు. కొన్ని అనుభవాలు మహాభారమై ఆమెను వేధిస్తున్నాయి. వాటిని దింపుకోవాలి.

అప్పటికి నేనేం మాట్లాడలేదు.

ఇంట్లోకి వెళ్లేక పిల్లలిద్దరికీ దుస్తులు మార్చి, మంచంమీద పడుకోబెట్టి రొజాయి కప్పాం. తర్వాత ఆమెతో, "వసూ! నీ ప్రయాణ విశేషాలు చెప్పు" అన్నాను.

శ్రీమతి మాట్లాడబోయి ఆగింది. గొంతులోని తడి కళ్లలోకి ఎగబాకి అక్కణ్ణించి క్రమంగా జలపాతమౌతుంటే – తనే తుడుచుకుంది.

తను తమాయించుకునేదాకా నేనలా చూస్తూనే ఉన్నాను తప్ప తాకడానికి కూడా ప్రయత్నించలేదు.

కాసేపటికామె తేరుకుని, "అవి నా ప్రయాణ విశేషాలు కావు. 'నిన్న'ని తలచుకుంటేనే అమ్మో అనిపింపజేసే దారుణ అనుభవాలు...." అంది.

ఆమె గొంతు చాలు – ఆ అనుభవాలనామెపై చూపిన ప్రభావం ఎంత దారుణమో ఊహించడానికి.

"చెప్పు" అన్నాను.

"ఇప్పుడు చెబితే మూడ్ మొత్తం పాడైపోతుంది. చెప్పకపోతే – మనసులోని భారం దిగదు"

అర్థమైంది.

ఎన్నో నెలల తర్వాత మళ్లీ దగ్గరయ్యాం. పిల్లలిద్దరూ అలసటతో వళ్లు తెలియకుండా నిద్రపోతున్నారు. అప్పుడు చెప్పుకోవాల్సిన మాటలు వేరే ఉంటాయి. అందుకే ఆమె తన ప్రయాణానుభవాలు చెప్పడానికి తటపటాయిస్తోంది. కానీ అవే చెప్పాలనుంది.

"అర్థాంగివి. నా మనోభారాన్ని దించడానికైనా, నువ్వా అనుభవాలు చెప్పాలిగా" అన్నాను.

ఆమె గొంతు సవరించుకుంది. నేను చెవులు రిక్కించాను.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments